


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
ఆదివారం
16-11-2025
పేజీలు: 02

# సినీ ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్న వారణాసి గ్లింప్స్

సూపర్ స్టార్ మహేశ్‌బాబు – దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' నుంచి భారీ అప్‌డేట్ వచ్చేసింది. అభిమానులతోపాటు మొత్తం సినీ పరిశ్రమ వేచి చూసిన గ్లింప్స్ వీడియోను గ్లోబ్‌ట్రాటర్ గ్రాండ్ ఈవెంట్‌లో ఘనంగా విడుదల చేశారు. మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ వీడియోలో చూపించిన విజువల్స్ ప్రపంచ స్థాయి మేధస్సు, విపరీతమైన స్కేలు చూపిస్తున్నాయి. గ్లింప్స్‌లో వారణాసి 512 CE, గ్రహశకలం శాంభవి 2027 CE, అంటార్కిటికా–ఆఫ్రికా, ఉగ్రభట్టి కేవల్, లంకా–త్రేతాయుగం, వారణాసి మణికర్ణిక ఘాట్ వంటి అనేక ప్రాంతాలు, యుగాలు చూపించారు. దీంతో ఈ చిత్రం ఒక్క జానర్‌కు పరిమితం కాదని స్పష్టమవుతోంది.



# రస్సెల్, పతిరణ సహా స్టార్ ఆటగాళ్లు విడుదల



2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌కు ముందు జట్ల కూర్పులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. మినీ వేలం కోసం ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియడంతో, ఫ్రాంచైజీలు విడుదల చేసిన ఆటగాళ్ల జాబితా సంచలనం సృష్టించింది. ముఖ్యంగా కొన్ని పెద్ద జట్లు ఊహించని విధంగా తమ స్టార్ ఆటగాళ్లను వదులుకున్నాయి. డిసెంబర్ 16న అబుదాబిలో జరగనున్న వేలానికి ముందు, పాత స్క్వాడ్‌లకు వీడ్కోలు పలికి, కొత్త వ్యూహాలతో బరిలోకి దిగేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది తీసుకున్న కఠిన నిర్ణయాల్లో కొన్ని అభిమానులను ఆశ్చర్యపరిచాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ తమ పవర్ హిట్టర్లు ఆండ్రీ రస్సెల్ మరియు వెంకటేష్ అయ్యర్‌లను వదులుకుంది. వీరితో పాటు క్వింటన్ డి కాక్, మొయిన్ అలీ లాంటి అంతర్జాతీయ ఆటగాళ్లను కూడా కేకేఆర్ రిలీజ్ చేసింది. అటు చెన్నై సూపర్ కింగ్స్ కూడా యువ సంచలనం మతీశ పతిరణను మరియు విదేశీ ఓపెనర్లు డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్రను విడుదల చేసింది. ఇక, పంజాబ్ కింగ్స్ కూడా ఆస్ట్రేలియా ఆల్-రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను వదులుకుంది. ఈ నిర్ణయాలన్నీ



జట్లు భారీగా డబ్బును మిగుల్చుకోవడానికి మరియు కొత్త ఆటగాళ్లను తీసుకోవడానికి దారితీశాయి. వేలానికి ముందే జరిగిన ఆటగాళ్ల ట్రేడ్‌లు జట్ల మధ్య బలాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ ఏడాది అతిపెద్ద ట్రేడ్‌లో సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ కు మారారు. ఈ డీల్‌కు బదులుగా, సీఎస్కే తమ స్టార్ ఆల్-రౌండర్లు రవీంద్ర జడేజా మరియు సామ్ కరన్‌లను రాజస్థాన్‌కు పంపింది. మరోవైపు, స్టార్ పేసర్ మహ్మద్ షమీ సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్ కు బదిలీ కాగా, ముంబై ఇండియన్స్ ఆల్-రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను ఎల్‌ఎస్జీ నుంచి, షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్‌ను గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడ్ ద్వారా దక్కించుకుంది. ఆటగాళ్లను వదులుకోవడంతో జట్ల దగ్గర మిగిలిన పర్స్ వివరాలను పరిశీలిస్తే, కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా సుమారు ₹64.30 కోట్లు, ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ వద్ద ₹43.40 కోట్లు మిగిలి ఉన్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ దగ్గర ₹25.50 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ దగ్గర ₹22.95 కోట్లు ఉన్నాయి. అయితే, ముంబై ఇండియన్స్ వద్ద మాత్రం కేవలం ₹2.75 కోట్లు మాత్రమే మిగిలి ఉండడం గమనార్హం. కేకేఆర్, సీఎస్కే ల దగ్గర భారీ పర్స్ ఉండడంతో, డిసెంబర్ 16న అబుదాబిలో జరిగే మినీ వేలం ఐపీఎల్ 2026 విన్నర్‌ను నిర్ణయించే కీలక ఘట్టం కానుంది.

## ఎర్రచందనం అక్రమ రవాణాపై
# ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష



రాష్ట్ర అమూల్య సంపద అయిన ఎర్రచందనం పరిరక్షణకు, అక్రమ రవాణా నిరోధానికి ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. శేషాచలం అడవుల నుంచి ఒక్క ఎర్రచందనం దుంగ కూడా బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం అటవీశాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆయన, ఎర్రచందనం అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో నిర్దేశిత శాతాన్ని తిరిగి వనాల అభివృద్ధి, సంరక్షణకే కేటాయించే ఆలోచన చేస్తున్నట్లు




స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ను నిర్వీర్యం చేశారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. 2019 -24 మధ్య కాలంలో లక్షలాది ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తరలించారని, తిరుపతిలోని గోదాముల్లో పట్టుబడిన దుంగలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి పునరావృతం కానివ్వబోమని, స్మగ్లింగ్ కింగ్‌పిన్‌లను చట్టం ముందు నిలుపుతామని హెచ్చరించారు. పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేసి అక్రమార్కుల ఆట కట్టించాలని ఆదేశించారు.ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పవన్ సూచించారు. స్మగ్లింగ్ జరిగే మార్గాల్లో థర్మల్ డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టులను పటిష్టం చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో నేపాల్, ఇతర రాష్ట్రాల్లో పట్టుబడిన వందలాది టన్నుల ఎర్రచందనాన్ని వెనక్కి తెచ్చే ప్రక్రియ వేగవంతం చేశామని తెలిపారు. అటవీ సిబ్బంది ఎర్రచందనం సంరక్షణను ఒక సంకల్పంగా తీసుకోవాలని, సమాచారం చేరవేసే ఇంటి దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# నాకు దేవుడి మీద పెద్దగా నమ్మకం లేదు

దిగ్గజ దర్శకుడు రాజమౌళి – సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'వారణాసి'. ఇన్నిరోజులు ఎస్ఎస్ఎంబీ29, గ్లోబ్ ట్రాటర్ అనే వర్కింగ్ టైటిల్స్‌తో పిలుచుకున్న ఈ చిత్రం తాజాగా శనివారం టైటిల్ లాంఛ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా జరుపుకుంది. అయితే ఈ టైటిల్ లాంచ్‌తో పాటు మూవీ అనౌన్స్‌మెంట్ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. వారణాసి వరల్డ్ అంటూ ఈ వీడియోను పంచుకుంది. అయితే ఈ వేడుకలో ట్రైలర్ లాంచ్‌కి ముందు ఎల్ ఈడీ తెరలకు సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో ఈ విషయాన్ని రాజమౌళి తెలుపుతూ.. నేను మాములుగా దేవుడిని నమ్మను. నాన్న గారు వచ్చి ఇందాక హనుమాన్ వెనకాల ఉంటాడు.. గుండెతట్టి నడిపిస్తాడు అని చెప్పారు.. ఇలా అయిన వెంటనే కోపం వచ్చిందండి ‌- - -ఇదేనా నడిపించేది అని. మా ఆవిడకి హనుమంతుడు అంటే చాలా చాలా ఇష్టం.. ఫ్రెండ్ లాగా మాట్లాడుతది అతడితో.. మా ఆవిడా మీద కూడా కోపం వచ్చింది- - - ఏంటి ఇదేనా చేసేది అని.. తాను ముందు రోజు తెరపై డెమో చూద్దామనుకున్నాం. కానీ ఎవరో మాకు తెలియకుండా డ్రోన్ ప్రదర్శించారు. అందుకే డైరెక్ట్‌గా ఈవెంట్‌లో ప్రదర్శించుదాం అని ఇలా చేస్తే సాంకేతిక సమస్య వచ్చింది. అంటూ రాజమౌళి చెప్పుకోచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరం
## మరోతరం వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ అరంగ్రేటం



ఏపీ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల్లో వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ రాజకీయాల్లో అరంగ్రేటం చేయనున్నారు. ఈ మేరకు ప్రజలతో తాను మమేకం అవుతానని.. ఇక నుంచి పాలిటిక్స్‌లో యాక్టివ్ అవుతానని వ్యాఖ్యానించారు. ఇవాళ(ఆదివారం) వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించి త్వరలోనే రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు ఆశ కిరణ్. ఈ సందర్భంగా ఆశా కిరణ్ మీడియాతో మాట్లాడారు. రాధా, రంగా మిత్రమండలి ఆహ్వానం మేరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు. రంగా ఆశయ సాధన కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల జీవితానికి కొంతకాలంగా తాను దూరంగా ఉన్నానని.. ఇకపై పూర్తిగా తన జర్నీ ప్రజలతోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. రాధా, రంగా మిత్రా మండలి మధ్య కొంత గ్యాప్ ఉందని పేర్కొన్నారు. ఆ గ్యాప్ ఫుల్ ఫిల్ చేయడానికి తాను రాజకీయాల్లోకి వస్తున్నానని వివరించారు. కులం, మతం బేధం లేకుండా సహాయం చేశారని వంగవీటి రాధా, రంగాలని కీర్తించారు ఆశా కిరణ్.

# ఓటీటీ ఎంట్రీకి రెడీ అంటున్న పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఇప్పుడు కోలీవుడ్ లో మంచి డిమాండ్ ఏర్పర్చుకున్న టాప్ స్టార్ హీరోయిన్స్ లో ఒకామెనే పూజా హెగ్డే. ఒకపక్క హీరోయిన్ గా సినిమాలు ఇంకోపక్క ఐటెం భామగా కూడా పలు సినిమాలు చేస్తూ మళ్ళీ బిజీగా మారిన ఆమె రీసెంట్ గానే "కూలీ" సినిమాలో సెన్సేషనల్ హిట్ సాంగ్ లో కనిపించింది. ఇక ఇదిలా ఉండగా పూజా హెగ్డేపై ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ వినిపిస్తుంది. దీని ప్రకారం పూజా హెగ్డే తన ఓటిటి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయ్యినట్టు తెలుస్తుంది. పాపుల దిగ్గజ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్ లో ఆమె ఓ క్రేజీ వెబ్ సిరీస్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఇప్పుడు టాక్. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉన్నాయి. ఇక హీరోయిన్ గా ప్రస్తుతం ఆమె జన నాయకుడు, కాంచన 4 తదితర సాలిడ్ ప్రాజెక్ట్ లలో ఆమె నటిస్తుంది.

# తెలంగాణలో ఎముకలు కొరికే చలి..
# అత్యల్పంగా 7.8 డిగ్రీల ఉష్ణోగ్రత



మొన్నటి వరకు వర్షాలతో ఇబ్బంది పడ్డ తెలంగాణ ప్రజలు ఇప్పుడు చలికి గజ గజ వణుకుతున్నారు. ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. నగర వాసులు కూడా చలి తీవ్రత పెరగడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే వాతావరణ శాఖ రాష్ట్రంలో మూడు రోజులు పాటు చలి తీవ్రత పెరుగుతుందని.. ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ క్రమంలో నేడు, రేపు చలి అధికంగా ఉంటుందని.. కనుక జనాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆ వివరాలు.. పెరిగిన చలి తీవ్రతతో తెలంగాణలోని పలు జిల్లాలు వణికిపోతున్నాయి. ఇక తాజాగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో తెలంగాణలోనే అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కోహీర్‌లో అత్యల్పంగా 7.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీన్ని బట్టి రాష్ట్రంలో చలి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలో సంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో చలి తీవ్రత బాగా పెరిగింది. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ప్రతి ఏటా ఇక్కడ అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈసంవత్సరం కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. తాజాగా జిల్లాలోని లింగాపూర్ మండలంలో 8.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అదేవిధంగా తిర్యాణి మండలంలో కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేటలో 8.7, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో 8.8, మెదక్ జిల్లాలో ఉన్న శివ్వంపేటలో 9, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న రుద్రంగిలో 9.1, ఆదిలాబాద్ జిల్లా, బజార్‌హత్నూర్‌లో 9.3, కామారెడ్డి జిల్లా నిజామాబాద్ జిల్లాలోని నస్రూల్లాబాద్, సాలూరులో 9.4, సిద్దిపేట జిల్లాలో ఉన్న అక్బర్‌పేట-భూంపల్లి ప్రాంతంలో 9.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక మిగిలిన జిల్లాల్లో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలే ఉన్నాయి. ఈ రెండు రోజులు అనగా శని, ఆదివారాల్లో కూడా రాష్ట్రంలోని పలు చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. అలానే చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ రెండు రోజుల క్రితమే హెచ్చరించింది.. యెల్లో అలర్ట్ జారీ చేసింది. అలానే ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈసారి కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



## పెళ్లి కావట్లేదని యువతుల దారుణం..
# 16 రోజుల చిన్నారి బలి

రాజస్థాన్ రాష్ట్రంలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. పెళ్లి కోసం నలుగురు యువతులు ఘాతుకానికి ఒడిగట్టారు. 16 నెలల చిన్నారిని బలి తీసుకున్నారు. పసికందును చంపితే తమకు పెళ్లి అవుతుందన్న మూఢనమ్మకంతో ఈ దారుణమైన పని చేశారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. జోధ్‌పూర్‌కు చెందిన నలుగురు యువతులు గత కొన్నేళ్ల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయినా ఒక్కటి కూడా సెట్ అవ్వలేదు. ఏళ్లు గడుస్తుండటంతో నలుగురు అక్కాచెల్లెళ్లలో అసహనం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే వారికి బావ వరుసయ్యే వ్యక్తికి సంవత్సరం క్రితం పెళ్లయింది. 16 రోజుల క్రితం కొడుకు పుట్టాడు. ఆ బాబును భైరు దేవుడికి బలి ఇస్తే తమకు పెళ్లి అవుతుందని వారు భావించారు. నలుగురు కలిసి బాలుడ్ని తమ రూములోకి తీసుకెళ్లారు. కాళ్లతో పిల్లాడిని తొక్కి చంపేశారు. తర్వాత క్షుద్ర పూజలు మొదలెట్టారు. ఓ యువతి తన ఒడిలో బాబు శవాన్ని పెట్టుకుని మంత్రాలను చదువుతూ ఉంటే.. మిగిలిన వాళ్లు కింద కూర్చుని మంత్రాలు చదవసాగారు.

## ఫీజులు భారీగా పెరిగాయి, కొత్త ధరలు లక్షలకు పైగా!




తెలంగాణలో ఫ్యాన్సీ నంబర్ల ఫీజులు భారీగా పెరిగాయి. కొత్త ధరలు లక్షలకన్నా ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం తెలంగాణ మోటారు వాహనాల నిబంధనలు-1989లోని రూల్ 81లో సవరణలు చేసి, శనివారం జీ.ఓ నెం.77 విడుదల చేసింది.ఇప్పటి నుంచి ఫ్యాన్సీ నంబర్ల కోసం దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలి. ఒకే నంబర్ కోసం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది దరఖాస్తు చేస్తే, నంబర్‌ను వేలం ద్వారా కేటాయిస్తారు.ఉదాహరణకు, 9999 ఫ్యాన్సీ నంబర్ గతంలో 50,000 రూపాయలకే లభించేది. ఇప్పుడు అదే నంబర్ లక్షల రూపాయలకూ పైగా ఉంది. కొత్త ఆన్‌లైన్ విధానం ప్రకారం వాహనదారులు రవాణా శాఖ పోర్టల్ (www.transport.telangana.gov.in)లో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ ఫీజుల పెంపుతో రవాణా శాఖ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అధికారులు ఆశిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో హైదరాబాద్‌లోని ఐదు ఆర్టీఏల ద్వారా ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రికార్డు స్థాయిలో 124.2 కోట్లు ఆదాయం సమకూర్చారు. తాజా సవరణలతో ఈ ఆదాయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

# కాజల్ హాట్ స్టిల్స్

చాలా మంది హీరోయిన్ గా అవకాశాలు అందుకోవడానికి ఎంతో ప్రయత్నిస్తూ ఉంటారు. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తుండటంతో బడా సినిమాల్లో ఛాన్స్ లు వస్తే ఎగిరి గంతేస్తారు.. కానీ కొంతమంది హీరోయిన్స్ అందం కారణంగా కొన్నిసార్లు అవకాశాలు మిస్ అవుతూ ఉంటారు. అందంగా లేరు అని కొంతమందికి క్రేజీ ఆఫర్స్ మిస్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆకర్షణీయంగా లేరు అని , బొద్దుగా ఉన్నారని సినిమా ఆఫర్స్ మిస్ అయిన ముద్దుగుమ్మలు చాలా మందే ఉన్నారు. అయితే ఇప్పుడు ఓ స్టార్ హీరోయిన్ కు విచిత్రమైన సమస్య ఎదురైందని తెలుస్తుంది. ఆమె అందమే ఆమెకు బడా సినిమా ఆఫర్ మిస్ అయ్యేలా చేసిందని టాక్ వినిపిస్తుంది. టాలీవుడ్ చందమామగా పేరు తెచ్చుకుంది కాజల్ అగర్వాల్. తెలుగులో తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ గ ఎదిగిన వారిలో కాజల్ అగర్వాల్ ఒకరు. ఈ అమ్మడు లక్ష్మీ కళ్యాణం సినిమాతో టాలీవుడ్ కు వచ్చిన ఈ చిన్నది ఆతర్వాత వరుస సినిమాలతో స్టార్ గా మారింది. బ్యాక్ టు బ్యాక్ బడా హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంది.



## భారత్‌లో ప్రపంచ సమస్యలకు
# సమాధానం: మోహన్ భాగవత్



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్, భారతదేశంలో ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు అందించే తెలివితేటలు, ఆలోచనా శక్తి ఉన్నాయని పేర్కొన్నారు. జైపూర్‌లో జరిగిన దీన్ దయాళ్ స్మృతి ఉపన్యాసంలో ఆయన మాట్లాడుతూ, భారత్ వేగంగా అభివృద్ధి దిశగా సాగుతోందని తెలిపారు. దేశంలోని సంస్కృతి, జ్ఞానం ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ ఆలోచనా విధానం గ్లోబల్ సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించగలదని నొక్కి చెప్పారు. జాతీయవాదం ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలకు కారణమవుతోందని మోహన్ భాగవత్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయవాదం గురించి ప్రపంచ నాయకులు మాట్లాడుతున్నప్పటికీ, వారు తమ దేశ ప్రయోజనాలనే ముందుగా పరిగణిస్తారని ఆయన విశ్లేషించారు. ఈ విధానం వల్ల ప్రపంచ శాంతి, సహకారం సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఈ సందర్భంలో సమతుల్య దృక్పథంతో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాలను అందించగలదని ఆయన సూచించారు. భారతదేశం ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, దీనికి దేశంలోని యువత, సంస్కృతి, సాంకేతికత కీలకమని భాగవత్ అన్నారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ఆయన కొనియాడారు.

## మిర్చి రైతుల పంట పండింది..
# అక్కడ క్వింటాల్ ధర ఏకంగా రూ.30 వేలు



ఈఏడాది కురిసిన అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాలనే మిగిల్చాయి. ఇక తాజాగా వచ్చిన మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పత్తి, వరి, మిరప చేలు పెద్ద పరిమాణంలో దెబ్బ తిన్నాయి. ధాన్యం తడిచింది. ఎండబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. ఇక పత్తి రైతుల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈసంవత్సరం పత్తి రైతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు పత్తి తడవడం.. మరో వైపు సీసీఐ నిబంధనలు వెరసి పత్తి రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఈక్రమంలో మిర్చి రైతులకు మాత్రం ఇది శుభవార్త అనే చెప్పవచ్చు. తాజాగా క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.30 వేల రూపాయలు పలికింది. సీజన్ ప్రారంభంలో ఇంత భారీ ధర పలకడం శుభపరిణామం అని చెప్పవచ్చు. అయితే పంట పూర్తిగా మార్కెట్‌కు వచ్చే వరకు ఇదే ధర ఉంటే.. రైతులకు చాలా మేలు జరుగుతుంది అంటున్నారు. కానీ అప్పటికి ధరలు తగ్గుతాయని రైతులు చెబుతున్నారు.

## పాక్ డ్రోన్ ఉగ్రవాదం..
# NIA దెబ్బతో గ్యాంగ్‌ల ఆట కట్టు



జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ సరఫరా చేసే అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఛేదించింది. ఈ కుట్రలో కీలక వ్యక్తి విశాల్ ప్రచార్‌ను అరెస్టు చేసిన NIA, తాజాగా అతడిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పాక్ సరిహద్దుల నుంచి డ్రోన్ల ద్వారా వచ్చే నిషేధిత వస్తువులను గ్యాంగ్‌లు స్వీకరించి, భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు చేరవేస్తున్నట్లు వెల్లడైంది. ఈ కార్యకలాపాలు దేశంలో అస్థిరత సృష్టించే లక్ష్యంతో జరుగుతున్నాయని NIA తెలిపింది. ఈ గ్యాంగ్‌లు పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లలో విస్తృతంగా పనిచేస్తున్నాయి. డ్రోన్ల ద్వారా వచ్చే అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను ఈ గ్యాంగ్‌లు సేకరించి, ఉగ్రవాద కార్యకలాపాలకు సరఫరా చేస్తున్నాయి. అలాగే, డ్రగ్స్‌ను స్థానిక మార్కెట్లలో విక్రయించి, ఆ నిధులను మరిన్ని నేర కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు NIA విచారణలో తేలింది. ఈ కార్యకలాపాలు యువతను డ్రగ్స్ బానిసలుగా మార్చడంతో పాటు, సామాజిక సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. పాకిస్థాన్‌లోని కొన్ని సమూహాలు ఈ కుట్రల వెనుక ఉన్నట్లు NIA గుర్తించింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి, సరిహద్దు భద్రతను కాపాడే భారత దళాల దృష్టిని ఈ గ్యాంగ్‌లు తప్పిస్తున్నాయి. అత్యాధునిక డ్రోన్ల ద్వారా రాత్రివేళల్లో ఈ సరఫరా కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## వైభవ్ సూర్యవంశీ.. సెంచరీ సంచలనం, తండ్రి స్ఫూర్తి!



యంగ్ క్రికెట్ స్టార్ వైభవ్ సూర్యవంశీ ఇటీవల UAEపై అద్భుత బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ సాధించి, తన అసాధారణ ప్రతిభను చాటాడు. ఈ ఘనతతో భారత క్రికెట్ అభిమానుల హృదయాల్లో స్థానం సంపాదించిన వైభవ్, తన ఆటతీరుతో భవిష్యత్ స్టార్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ యువ ఆటగాడి ప్రదర్శన అతడి కఠిన శ్రమ, అంకితభావాన్ని ప్రతిబింబిస్తోంది. BCCI ఇంటర్వ్యూలో వైభవ్ తన కుటుంబం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తన తండ్రి ఎప్పుడూ ఎక్కువ ఆశిస్తారని, 200 రన్స్ చేసినా ''ఇంకో 10 రన్స్ చేయాల్సింది'' అని అంటారని చెప్పాడు. ఈ కఠినమైన స్ఫూర్తి తనను మరింత మెరుగ్గా ఆడేలా ప్రేరేపిస్తుందని వైభవ్ తెలిపాడు. తండ్రి సలహాలు అతడి ఆటలో స్థిరత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని ఆయన గుర్తుచేసుకున్నాడు. అయితే, వైభవ్ తల్లి మాత్రం ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని ఆయన వెల్లడించాడు. సెంచరీ చేసినా, డకౌట్ అయినా ఆమె సంతోషంగా ఉంటూ, ''బాగా ఆడు'' అని ప్రోత్సహిస్తుందట. ఈ భిన్నమైన మద్దతు వైభవ్‌కు మానసిక బలాన్ని అందిస్తుందని ఆయన చెప్పాడు. తల్లి ప్రేమ, సానుకూలత అతడి క్రికెట్ జీవితంలో సమతుల్యతను తెచ్చాయని వైభవ్ వివరించాడు. వైభవ్ సూర్యవంశీ ఈ స్థాయి విజయాన్ని సాధించడం వెనుక కుటుంబం, కోచ్‌లు, సహచర ఆటగాళ్ల మద్దతు ఉంది. అతడి ఈ అద్భుత ప్రదర్శన భారత క్రికెట్‌కు కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

## కేరళ 'కొడిన్హి'.. ప్రపంచాన్ని
# ఆశ్చర్యపరిచే కవలల గ్రామం!



కేరళలోని మలప్పురం జిల్లాలో ఉన్న చిన్న గ్రామం కొడిన్హి. కేవలం 2400 మంది జనాభా ఉన్న ఈ ఊరిలో ఏకంగా 450కి పైగా జత కవలలు నివసిస్తున్నారు. ఒక చిన్న గ్రామంలో ఇంతమంది కవలలు ఉండటం ప్రపంచంలోనే అరుదైన రికార్డుగా మారింది. దీన్ని బట్టి లెక్క వేస్తే ప్రతి 1000 మందికి సగటున 45 జతల కవలలు ఉన్నట్టు లెక్క వస్తోంది. ఇది సాధారణ ప్రపంచ సగటు కంటే దాదాపు ఆరు రెట్లు ఎక్కువ! ఈ గ్రామంలో కవల పిల్లలు ఎక్కువగా పుట్టడం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గత 15-20 ఏళ్లలోనే మరో 220 జతల కవలలు ఇక్కడ జన్మించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడ స్థిరపడిన కుటుంబాల్లో కూడా కవల పిల్లలు జన్మిస్తున్నారు. అంటే ఇది కేవలం స్థానిక కుటుంబాల జన్యు సమస్య మాత్రమే కాదని స్పష్టమవుతోంది. ఏదో ఈ గ్రామానికి ప్రత్యేకంగా ఉన్న అంశం దీనికి కారణమని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జన్యుశాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు, యూనివర్శిటీలు ఈ రహస్యాన్ని కనుగొనేందుకు ఎన్నో సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తున్నారు.